# లీల నెరిగిన లీల

వి. యస్. అవధాని

ముసలి లాయరు గబగబా నడుస్తున్నాడు. కోపంవల్ల అతని ముఖం ముడుచుకుపోయింది. కాళ్లు తడబడుతున్నాయి. అయినా రోడ్డువెంట నడుస్తున్నాడు అతని అనుభవం అతని మేధను ప్రశ్నిస్తోంది - పరీక్షిస్తోంది. లాయరుగా పెద్ద పేరు సంపాదించకపోయినా భుక్తికి సరిపోయినంతమాత్రం సంపాదించగలిగాడు. తన తండ్రి పంచి ఇచ్చిన పదెకరాలూ చెక్కు చెదరకుండానే ఇంతవరకూ రోజులు గడిపాడు. తన నలుగురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూ పెద్దవాళ్లయారు. పెద్ద కొడుకు బి. యిడి. ప్యాసయి మేష్టరుద్యోగం చేస్తున్నాడు. రెండో కొడుకు వాసు

వాసు విషయమే అతని తండ్రికి పెద్ద బరువుగానూ అంతకన్నా ఎక్కువ బాధగానూ ఉంది. కారణం వాసు తెలివి తక్కువవాడవటం కాదు. బి. ఏ. ప్యాసయాడు. ఆ తరువాతనే అతను-తన తండ్రి శేషయ్యకు దూరం అయినాడు. అంటే ఇంట్లోనుంచి వెళ్లిపోలేదు. తండ్రిమీద తిరగబడలేదు తల్లిని అనవసరంగా విసుక్కోలేదు. వీటిల్లో ఏ ఒక్కటైనా వాసుకి అలవడితే బహుశా శేషయ్య ఇంత బాధపడేవాడు కాదు. దిగులుపడేవాడు కాదు. తనను తాను కష్టు పెట్టుకునేవాడు కాదు.

నడిచి నడిచి గవర్నమెంటు ఆసుపత్రి దగ్గర ఆగాడు. అతనికి తెలుసు రోజూ వాసూ లీలా ఇక్కడ కలుసుకుంటారని. ఇవాళ ఆ అమ్మాయితో పరిచయం కలిగించుకొని "నా కొడుకుతో నువ్వు ఎటువంటి సంబంధం పెట్టుకో వద్ద"ని చెప్ప దలచుకున్నాడు. కాని అట్లా చెప్పడంలోని ఉచితానుచితాల సంగతిని గురించి ఆయన విచారించడు. విచారించడం అనవసరం అని ఆయనకు తెలుసు.

ఒక పదినిముషాలు అలా నిలుచుని ఉన్నాడు. ఇంతలో లీల ఒక లేడీ గొడుగుతోనూ ఎత్తు మడమల బూట్లతోనూ బయటికి వచ్చింది. ఆ అమ్మాయే లీలాదేవి అని తనకు తెలుసు. ఐనా "నీ పేరేమిటమ్మా" అన్నాడు శేషయ్య. పోతూ ఉన్న లీల ఆగి "నా పేరాండి లీల" అన్నది.

"నీతో కొంచెం మాట్లాడాలి."

"మాట్లాడండి..."

"ఇప్పుడు కాదు. మీ ఇంటిదగ్గర."

"మా యింటిదగ్గరనా, ఏం సంగతి?"

"చాలా ముఖ్యమయిన సంగతి."

"అంత ముఖ్యం అయితే ఇప్పుడే మాట్లాడండి."

"ముఖ్యమయిన దన్నానేగాని అర్జంటయింది అనలేదుగా."

"అట్లయితే మాయిల్లు నగరం పాలెంలో పెద్దబావికి ఎదురుగా. మీయిష్టం వచ్చినప్పుడు వచ్చి మాట్లాడండి" అంటూ లీల వెళ్ళిపోయింది. శేషయ్య ఎంతో నిష్కర్షగా మాట్లాడుదామని అనుకున్నాడు. కాని అలా చేయలేక పోయినాడు. ఆమెలోని ఏదో ఒకశక్తి తనను తను అనుకున్నంత మోటుగా ప్రవర్తించనీయ లేదు. బహుశా ఆశక్తే వాసుని దాసుణ్నిగా చేసికొని ఉంటుంది. తిరిగి ఎటూ నిర్దేశం లేకుండా నడుస్తున్నాడు శేషయ్య.

అంత బస్తీలో ఎంతో హడావుడి ఉంటుంది. శేషయ్యవంటి ప్లీడర్లూ ముసలివాళ్ళూ చాలా మంది ఉంటారు. ఐనా తనలాగా బాధ పడుతున్నవాళ్లు ఎవరూ లేరని ఆయన అనుకుంటున్నాడు. పార్కు దాటాడు; పార్కులోనుంచి తనను ఎరిగి ఉన్న స్నేహితులు ఎవరన్నా వస్తారేమోనని ఇటువైపు తిరిగి అగ్రహారం వైపు పోయినాడు.

అగ్రహారంలో ఏడుగొందుల సందులోంచి వెళుతుంటే వెనకనుంచి ఒక చిన్న కారు వస్తోంది. కారు హారన్ రెండు మూడు సార్లు వేసిందాకా తనకు అది వస్తున్నట్లు తెలియ

లేదు. కారు స్పీడు తగ్గింది—మెల్లిగా తనను దాటిపోయింది. అందులో ఎవరున్నారో నని చూసీ చూడనట్లు చూశాడు. వాసు-లీలా—వాసుని పిలుద్దామని అనుకున్నాడు. పిలిస్తే కారు ఆపుతాడు. దిగివస్తాడు. కాని ఏం ప్రయోజనం? పైగా ఆ నడివీధిలో తనే అల్లరి పడిపోతాడు.

తను అల్లరి పడడమేమిటి? తనను చిన్నప్పటి నుంచీ ఎరుగున్న వారెవరూ తన నడవడిలో వేలు పెట్టి చూపించరు! అయినా అది అసభ్యపు పని. పైగా తాను ఆలోచిస్తూండగానే కారు దాటి పోయింది. ఇంటికి పోయి రాత్రికి వాసుని గట్టిగా చీవాట్లు వేస్తే సరి అని అనుకుని ఊరట చెందాడు.

ఆ రాత్రి పది గంటలు దాటిన తరువాత గాని వాసు ఇంటికి రాలేదు. అప్పటికే ఇంట్లో అందరూ తిండి తిని పడుకున్నారు. మూడో కొడుకూ నాలుగోవాడూ ఇంకా చదువుకునే దశలోనే ఉన్నారు. వాళ్లు మాత్రం అప్పుడే పుస్తకాల నవతల పెట్టి మంచాలమీద పడుకో బోతున్నారు. నాలుగోవాడే వాసు పిలిస్తే తలుపు తీశాడు.

"నాన్న నీకోసం కనిపెట్టుకుని ఉన్నా రన్నాయి" అన్నాడు తలుపు తీస్తూనే.

"నాన్న ఏం చేస్తున్నాడు?"

"ఏమో. అన్నం తినగానే మేడమీదికి పోయాడు బహుశా నీకోసం కనిపెట్టుకుని ఉంటాడు. రాంగానే నిన్ను మేడమీదికి రమ్మన మన్నాడు."

వాసు తిన్నగా తండ్రిగదిలోకి పోయాడు. పడకకుర్చీలో కూర్చుని శేషయ్య భగవద్గీత చదువుతున్నాడు. వాసు రాంగానే "ఏరా ఈ వయస్సులో నేను బాధపడడం నీకు ఇష్టమా?" అన్నాడు. వాసుకి తన తండ్రి దేనిని గురించి మాట్లాడుతున్నాడో తెలుసు.

చాలా స్వాభావికంగా "బాధలు పడేవారికే వాటి సంగతి తెలుస్తుంది నాన్నా, అన్నాడు."

"అట్లాగా ... చదువుకుని బాధపడేవారి సంగతినే ఊహించలేవంటావా?"

"ఊహించగలను. కాని వాటిని తొలిగించుకో వాల్సిన వారు నా మాట విననప్పుడు నే చెప్పేదీ ఏముంటుంది?"

"చాలా చెప్పగలవు. చాలా చెయ్యగలవు. వాసూ, నా బాధకు కారణం నీకు తెలుసు. నువ్వు లీలాదేవి ఇంటికి పోవద్దు. ఆ అమ్మాయితో నీ పరిచయం నాకు తలవంపులుగా ఉన్నది."

"ఇందులో మీకు తలవంపులు రావాల్సిన అవ సరం ఏమీ లేదు నాన్నగారూ! అన్నీ మీరే ఊహించుకుని బాధపడుతున్నారు."

"అయితే ఊహా తప్పంటావన్నమాట. ఈ ఊహతోనే గదుటోయ్ నువ్వు కథలురాసేదీ. దాని నిశితాన్ని పట్టే గదుటోయ్ మనిషికీ జంతువుకీ తేడా కనిపించేది."

"నేను ఊహయొక్క స్థానాన్ని కొట్టే సెయ్యటం లేదు నాన్నా. మీ ఊహ సరయింది కాదని చెపుతున్నాను."

"అంటే... నేను జరిగే సంగతులేవీ చూడ కుండానే ఊహించుకుంటున్నానంటావా?"

"అనను. జరిగేవన్నీ చూస్తూనే ఉన్నారు. కాని వాటికి కారణాలను మాత్రం సరిగ్గా లెక్క కట్ట లేకుండా ఉన్నారు."

"ఏం కారణం నాయనా...లీల కన్న అంద మయినపిల్ల ఈ ఊళ్లోనే లేదంటావా? పోనీ అసలు భూమిలోనే లేదంటావా? లేక లీలతో నీ సంబంధానికి కారణం ఆడా మగలకి అందనిది అని అంటావా?"

"అట్లాగూ అనను. లీల సామాన్యమయిన అందంగలదే నంటాను. లీలకన్న అందమయిన ఆడవాళ్ళు మన వూళ్లోనే చాలామంది ఉన్నా రనీ నాకు తెలుసు. కాని స్త్రీ పురుషులసంబంధం కేవలం అందాన్నిబట్టె ఉండదని అంటాను."

"మరి కాకపోతే అది సంపాయించి పెడితే తింటూ కూర్చుందామనే సదుద్దేశ్యంతో దాన్ని పరిస్తున్నానంటావా...?"

"ఇది మీ స్వభావానికి లక్షణం నాన్నా. ఆడది సంపాయించిపెడితే తినాలన్న కోరిక నాకు లేదని మీకు తెలుసు. అట్లాంటి ఉద్దేశం ఉంటే మొన్న వచ్చిన ఆ డబ్బుగలవారి సంబం ధాన్ని ఒప్పుకుని ఉండేవాణ్ని. అయినా ఒక వేళ లీల సంపాయించి పెడతానంటే—నేను సంపాయించలేని స్థితిలో ఉంటే—కాదని అన గల సాహసం నాకు లేదు నాన్నా, అది వేరే సంగతి....."

"ఏం వేరే సంగతేనోయ్. వాళ్ళ ఇల్లు నగరం పాలెంలో ఉన్నదిటగదా?"

"అవును. ఏం అయితే?"

"నగరం పాలెంలో సభ్యతగల వాళ్ళెవరన్నా ఉన్నారా?"

"ఈ సభ్యత అనే మాటకు మీ అర్థం ఏమిటి నాన్నా?"

"...సభ్యత అంటే తెలియదా నీకు?"

"నాకు తెలుసునని నేను చెప్పను. నాకు ఒక అభిప్రాయం ఉన్నదన్న సంగతి నా ప్రశ్నను బట్టే తెలుస్తోంది. మీరు ప్లీడరుగా ఈ వూళ్లో పట్టిన కేసులన్నీ న్యాయమయినవని మీకు నమ్మకం ఉన్నదా? మీరు మీ కవసరమయిన డబ్బూ, కీర్తి—వీటికోసం కేసులు తీసుకున్నారు. మీ క్లయింటు ఖూనీ చేసివచ్చి "బాబూ నేనేమి ఎరగను వూరికినే ఉన్నవాణ్ని ఉన్నట్లు ఈ కేసులో ఇరికించారు" అని చెప్తూవుంటే మీరు వాడి దగ్గర డబ్బుతీసుకుని కోర్టులో వాడి పక్షాన హాజరయినారు. ఇది సభ్యత మీ త్రాసులో..."

"వాసూ, నీ తెలివినంతా ఉపయోగించి ఈ ముసలాణ్ని ఇంకా బాధ పెడుతున్నావేగాని నీ ప్రవర్తనను నువ్వు సరిదిద్దుకో ప్రయత్నించడం లేదు."

"మీ బాధను ఎక్కువ చెయ్యడం నా ఉద్దేశ్యంకాదు. దాన్ని వీలయినంతవరకూ తగ్గించడమే నా ఉద్దేశం. ఫలితం నేననుకున్నదానికి వ్యతిరేకంగా ఉండడానికి మీరు వ్యక్తిగతంగా బాధ్యులు."

'అంతేకాని లీలను వదలనంటావు?"

"ఆ మాటనే ననడంలేదు. అవసరం అయినపుడు వదులుతాను. కారణం ఉండాలి. కారణం లేకుండా మా సంబంధం ఏర్పడలేదు. కారణం లేకుండా తెగిపోదు."

"ఇదే నాకు బాధగా ఉన్నది. నువ్వు చెప్పినట్టుకాక శాశ్వత సంబంధాన్ని ఏర్పరుచుకోవడానికి తగిన పిల్లను ఎందుకు నీవు చేసుకోరాదు?"

"మీ ప్రశ్న నాకర్థం కావడంలేదునాన్నా. నా యీ అనుభవాన్ని నేను పొందుతున్నాను. పొందుతున్నట్టు నాకు తెలుసు. మీకు తెలుసు. కనుకనే మీరు నన్ను ఇంతగా ఈ విషయం గుచ్చి గుచ్చి అడుగుతున్నారు. మరి శాశ్వతం అని అంటారేమిటి? ఈ అనుభవం నిజం అయింది. దీర్ఘం కాకపోవచ్చు. దీర్ఘంగా నాకు ఈ లక్షణం ఉండాలి అని నేననుకోను. కొంచెం అయినా తృప్తిగా ఉండాలని అనుకుంటాను. ఇవ్వగలిగినంత ఇచ్చి, తీసుకోగలిగినంత తీసుకోగలవాడ్నే కాని..."

"వాసూ...నువ్వు ఆలోచించి మాట్లాడుతున్నావా!"

"ఇందులో ఆలోచించాలిసిందేమో ముందర చెప్పండి. తరువాత ఆలోచించాలిసిన అవసరం ఉంటే తప్పక ఆలోచిస్తాను. కాని నా ఆలోచన మీ ఆలోచనవలె ఉండదు."

"ఇదుగో ఈ సంగతే ... లీల నగరం పాలెంలో ఉంటోంది. హాస్పిటల్లో నర్సు ఉద్యోగం చేస్తోంది. బహుశా మన కులం కాకపోవచ్చు. అట్టి పిల్లతో నీవు తిరగడం..."

"మీరు మాట్లాడే పద్ధతి మీకు సభ్యతగా ఉన్నదా నాన్నా? మాట్లాడుతున్న సంగతి నాకు తెలుసు. నేను దేన్నిగురించి ఆలోచించాలి అని అడిగితే ఇదంతా చెపుతారు దేనికి?"

"అవును నీవు నాకు మాట్లాడే పద్ధతికూడా నేర్పాలి ఇహ."

"మీకు అయిందానికీ కాని దానికీ కోపం వస్తోంది. అంచేత ఈ విషయం మాట్లాడడం మానివేస్తే బాగుంటుంది."

"ఎందుకు బాగుండదూ ... బాగుంటుంది. నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటే ఈ ఆడపిల్లల పెళ్ళి ఎట్లా అవుతుందీ? ఈ చిన్న కుర్రాళ్లు నీ సంగతి పసిగట్టి అదే నేర్చుకుని పాడై పోతారు...నా యీ వయస్సులో భగవంతుడు ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు?..."

"మీరు ఇక్కడే అనవసర బాధ పడుతున్నారు. నేను ఈ యింట్లో ఉండడంవల్ల మీకు ఇబ్బందిగా ఉంటే ఆ సంగతి నాతో ఎందుకు చెప్పరూ? పోనీ చేసే తప్పుపనిని తప్పుగా మీరు ఎందుకు నిగ్గు తేల్చరూ?"

"నువ్వు చిన్నవాడివి కావు. వయసు వచ్చిన వాడివి. అంతో ఇంతో నాకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన వాడివి ఇలా తయారవుతే ఎట్లా? ప్రతి విషయాన్ని నీ హేతువాదంతో విపులీకరించ లేవు. నా మాట విను...అంతగా

ఆ అమ్మాయిని వదలలేకపోతే దాన్ని ఒక..."

"నాన్నా మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలియడం లేదు. నేను వెడుతున్నా. మీరు పడుకోండి. చాలా రాత్రయింది. నా విషయం మీరేమీ బాధపడ నవసరం లేదు. నేను మీ దోవకి అడ్డురాను."

అంటూ వాసు వెళ్ళిపోయాడు. శేషయ్యకు కోపం ఎక్కువయింది. కోపంతో పాటు తాపమూ ఎక్కువయింది. కాని వాసును తను తన తర్క బలంతో ఓడించలేక పోయినందుకు సిగ్గూ వచ్చింది. ఆ సిగ్గుతో పాటు పౌరుషమూ వచ్చింది. మర్నాడు వాసుతో ఖచ్చితంగా "ఈ యింట్లో నీకు చోటు లేదు" అని చెప్ప దలుచుకున్నాడు. అంతలో తనకు వచ్చిన అప్ర తిష్ట పోతుందా అన్న భయం అంతలో ఆయన్ను ఆవరించింది. ఆ భయంతోనే నిద్రపోయాడు. నిద్రలో ఆయనకు కల వచ్చింది. కలలో ఆయన భార్య లక్ష్మి కనుపించింది. "ఎక్కడెక్కడో చెడ తిరిగి ఈరోగాలన్నీ తెచ్చుకున్నారు. అవీ నాకూ అంటుకున్నయి. అబ్బబ్బ ఈ బాధ నేను పడ లేను..." అని ఇంకా ఏమేమో విసుక్కున్నది.

తెల్లవారింది. శేషయ్య స్నానం జపం పూర్తి చేసుకుని కొంచెం కాఫీ త్రాగి వాసు సంగతి విచారించగా ఆ రాత్రే ఎక్కడికో వెళ్ళిపోయా డనీ తాను బయటికి వెళ్ళాల్సి లేవగా బయట తలుపు తెరచిఉన్నదనీ, తనే వేసి పడుకున్నా ననీ నాలుగోవాడు చెప్పాడు. శేషయ్య నెత్తిన బరువు వదిలింది అని అనుకున్నాడు. కాని హృదయంలో ఏదో ఒక పెద్దమంట ఆరంభ మయింది. సంగతి తేలిగ్గా తెలిసిన పెద్ద కొడుకు ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

కొన్ని నెలలు గడిచినయి...

వాసు ఆ వూళ్ళోనే వేరే ఒక గది తీసుకుని ఉంటున్నాడు. రోజులెలా గడుస్తున్నాయో శేషయ్యకు తెలియదు. ఎందుకు తెలియాలి? ఆయనకు తన ధర్మం నిలబడడం ప్రధానం. తన దోవకి వాసు అడ్డురాకుండా ఉండాలి. వాసు ఆవూరు వదిలిపోతే శేషయ్యకు ఇంకా హాయిగా ఉండేదేమో. బయటికి ఎంత హాయిగా కను పిస్తున్నా లోపలమాత్రం ఆయన నేదో వేధిస్తునే ఉన్నది. 'మనిషికి ఒక విషపు కురుపుకూడా అతని వంటిలోనుంచే పుట్టుకువస్తుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు ఆ కురుపును కోసేస్తాం. ఆ వాసు విషయంకూడా అంతే" అని ఆయన అనుకో ప్రయత్నించేవాడు. అట్లా ఊరట చెందడానికి ప్రయత్నించినపుడల్లా ఆయన గతించిన భార్య లక్ష్మి-ఆయన కళ్ళల్లో మెసి లేది. ఆమె తనను ఎంతో కోపంగా చూసినట్లూ తనను కఠోరంగా ప్రశ్నిస్తున్నట్లూ తోచేది. కాని ఆపనర పరిస్థితులనుబట్టి అవన్నీ మరచిపో ప్రయత్నిచేవాడు. ఎంత ప్రయత్నించినా ఆయ నలో ఆరంభించిన బాధ మాత్రం రోజురోజుకీ ఎక్కువవుతోంది.

ఒకసారి మూడోవాడు కాలేజీ జీతం కట్టు కోవాలిసొస్తే శేషయ్య "నిన్నుకూడా చదివించి వా నంత వాణ్ని గా తయారు చేయాలా" అని అన్నాడు. అన్నాడేకాని రెండు మూడు రోజు లలో జీతం ఇద్దాం అని అనుకున్నాడు. కాని వాడు మళ్ళీ అడగలేదు. చివరకి ఆడపిల్ల చెప్పింది వాసే వాడికి సంవత్సరానికి కావల్సిన జీతం ఒకసారే ఇచ్చేశాడని. వాసుకి ఇంతడబ్బు ఎక్కడిదీ? ఇంట్లోంచి పోయికూడా తనను సాధించడానికి వాసు పూనుకోవడం శేషయ్యను మరీ కలవరపరచింది. కాని తనేం చెయ్యాలో మాత్రం ఆయనకు తెలియడం లేదు.

ఎంత ఆలోచించినా వాసు తనను ఏవిధంగా బాధ పెడుతున్నాడోమాత్రం శేషయ్యకు తెలి యడం లేదు. చివరికి శేషయ్య అనుకున్నాడు "వాసు వస్తుతః మంచివాడు. వాడు ఈ లీల స్నేహంవలననే పాడయిపోయినాడు. కాబట్టి లీలాదేవితో వాడి సంబంధాన్ని తెగగొట్టాలి." ఒకరోజు శేషయ్య 6 గంటలకి లీలాదేవి చెప్పిన గుర్తులనుబట్టి వాళ్ళ ఇంటికి తనకెంత ఇష్టం లేక పోయినా ఎదురవుతున్న ప్రతి ఆడదాన్నీ పరీక్షగా చూస్తూ చేరుకున్నాడు. నగరం పాలెంఅంటే ఆయనకు చాలా అసహ్యం. అసలు అటువంటి పేటను గవర్నమెంటు ఎందుకు గానుఇంతబస్తీలో ఉండనిస్తోందో ఆయనకు అర్థం గావడంలేదు. తనేఒక అధికారి అయితే అటువంటి పేటలన్నింటినీ తగలపెట్టించేశాడు. ఎంత అటు వైపు చూడవద్దని అనుకున్నా ఎలక్ట్రిక్ లైటు ముఖంపైపడుతున్న ప్రతి ఆడదాన్నీ చూడాలని

తన బుద్ధి అంటోంది. శంకర శ్లోకాలు వర్ణించు తుంటున్నా అందమయిన స్త్రీ కనుపించగానే కళ్లు అటే పోయేవి. ఆ సంగతి ఆలోచించ వద్దన్నా మనసు దాని గురించే ఆలోచిస్తోంది.

లీలాదేవి ఉన్న ఇల్లు అంత పెద్దది కాదు. అంత చిన్నదీ కాదు. ఇంటిముందర ఒక చిన్న తోట ఉన్నది. దాని చుట్టూ ఒక చిన్న పిట్ట గోడ ఉన్నది. చిన్న గేటు నెట్టుకుని లోపలికి ప్రవేశించాడు. శేషయ్య ఆయనలో అసమర్థత వలన ఎక్కువయిన చికాకూ, చికాకు వలన ఎక్కువయిన ఆందోళనా, ఆందోళన కారణంగా ఎక్కువయిన కర్తవ్యతామూఢతా, స్పష్టంగా కని పిస్తున్నాయి. గొంతు ఆరుకుపోయింది. బయటి వరండాలోకి పోయి "ఎవరమ్మా ఇంట్లో" అని బలవంతాన అన్నాడు. చేతులు తడబడుతూనే విసుగ్గా నెమ్మదిగా కొడుతున్నానని రెండు మూడుసార్లు మెల్లగా తలుపు తట్టాడు.

"ఎవరు వారు?" అంటూ ఓ నడివయస్సు స్త్రీ తలుపు తీసింది.

"లీలాదేవిగారు ఉన్న ఇల్లు ఇదేనాండి" అన్నాడు శేషయ్య.

"అవును" అంటూ ఆ స్త్రీ కొంచెం తీక్షణం గానూ, సాలోచనగానూ శేషయ్య ముఖం వైపు చూసింది.

అంతలో "ఆమె ఇంట్లో ఉన్నదాండి" అన్నాడు శేషయ్య.

"లేదు. ఇవాళ ఆమెకు హాస్పిటల్‌లో నైట్‌డ్యూటీ." అంటూనే "లోపలికి రాండి" అన్నది ఆ స్త్రీ.

"లోపలికి రాను. ఆమెతో కొంచెం పనుండి వచ్చాను."

"ఆమెతో పనుండే వచ్చారు గనక లోప లికి రమ్మంటున్నాను."

"ఆమె లేదన్నారుగా."

"లేదుకాని మీరు లోపలికి రావచ్చు. అను మాన పడాలిసిన అవసరం మీకు లేదు."

ఈ మాటలు వింటుంటే శేషయ్యకు చెప్ప లేనంత కోపం వస్తోంది. కాని "మీకు అవసరం లేదు." అని అన్నప్పుడు ఆమె తనవంక విలా సంగా చూసింది. ఆమె తీరుమాత్రం అదో విధంగా ఉన్నది. "లోపలికి వెళదామా వద్దా" అని ఆలోచిస్తూ శేషయ్య లోపలివాకిలులోకి పోయినాడు. ఆమె ఒక స్విచ్చివేస్తూ "ఆ కుర్చీ మీద కూర్చోండి." అన్నది. శేషయ్య కుర్చీ మీద తనకు తెలియకుండానే కూర్చున్నాడు.

"లీలతో మీ పని ఏమిటో నాకు చెపు తారా. అది రాగానే చెపుతాను. వీలయినంత తొందరలో మీ పని అయేటట్లు చూడమని చెప్తాను."

"నా పని అంత సులభంగా అయ్యేపని కాదు"

"అంత సులభంగాకాని పనిని దానినుంచి మీ రెందుకాశిస్తున్నారో?"

"ఆశించాలిసొచ్చింది......అయితే లీల నీ కూతురా?"

"అదట్లా ఉంచండి. ఎందుకని మీరు, లీల వద్దనుంచి దాని వలన సులభంగా కాని పనిని ఆశిస్తున్నారని అడుగుతున్నాను. అది చిన్న పిల్ల. అయినా తన బాధ్యత తానెరిగినదే. మిమ్మల్ని ఇంటికి పిలిపించుకుని మీ చేత ప్రతి మాలించుకోవాల్సిన పరిస్థితి."

"ఆమె నన్ను రమ్మనలేదు. నేనే వచ్చాను." "మీరే వచ్చారా? మీపని భారం నాకు చెప్ప డంచేత తగ్గుతుంది చెప్పండి."

"నీవు బహుశా లీల తల్లివే అయిఉంటావు. నాకొడుకు రెండోవాడు వాసు ఇక్కడికి తరుచు వస్తూంటాడా?"

"ఆ వస్తూంటారు. వారి నాయనగారు రా వద్దని అన్నాక ఇక్కడనే భోజనంకూడా చేస్తు న్నారు. అందులో మీకేం సంబంధం."

"నాకేం సంబంధమా? కావాల్సినంత సంబం ధం ఉన్నది. వీడి కారణంగా నా వంశం అప్ర తిష్టపాలయి పోతోంది. తల ఎత్తుకుని తిరగలేక పోతున్నా...ఇద్దరాడపిల్లలకు పెళ్లి చెయ్యా ల్సుంది."

"మీరు చెయ్యాల్సుంటే వాసు చెయ్యవద్ద న్నాడా? మీదోవకు అడ్డురాకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు గదా? మీవంశ ప్రతిష్టకు ఆయన తెచ్చిన అప్రతిష్ట ఏమిటి? ఆయనకు నచ్చిన పిల్లను ఆయన దొంగచాటుగా గాక బహిరంగంగా వరించాడు. ఇందులో మీ కీర్తి పోవాల్సిన అవసరంలేదు. అనవసరంగా

ఇటువంటి వ్యవహారాలలో జోక్యం చేసుకోకండి."

"...అనవసరంగా నా కొడుకు నాయిష్టాన్ని కాదంటున్నా నాకు సంబంధం లేదా?"

"సంబంధం లేదని అనడం లేదు. ఉన్న సంబంధాన్ని కాపాడుకో గలగాలి." "అంటే వాడేం చేస్తున్నా చూస్తూ ఊరుకోవాలా?"

"ఈప్రశ్నే మీ నాయనగారు మిమ్మల్ని వేస్తే మీరేం చెప్తారు?"

"అటువంటి ప్రశ్న మా నాయన వేయాల్సిన అవసరం లేదు. మా నాన్న ఇష్టపూర్తిగా చెసిన పిల్లనే నేను పెళ్ళి చేసుకున్నాను."

"నేను కాదనడం లేదు. కాని ఒకవేళ చేశారనుకోండి, అటువంటప్పుడు మీరేం చెప్తారు. జరిగినదాన్ని జరగలేదని చెప్పడానికి మీరు నేర్చుకున్న లా అంతా ఉపయోగించి ఆత్మద్రోహం చేసుకుంటారా? లేక మారినదాన్ని-మారలేదు, ఇదివరకటి మాదిరిగానే ఉన్నది అని అనుకుని తృప్తిపడతారా?"

"నువ్వు హద్దుమీరి మాట్లాడుతున్నావు."

"మీరు మీరినట్లు మాత్రం మీరలేదు ... ఇటు రండి...తప్పదు కొంచెం దయచెయ్యండి" అంటూ శేషయ్య చెయ్యి పట్టుకొని లోపల ఇంకో గదిలోకి తీసుకుపోయింది. గోడమీద నున్న ఒక పెద్దఫొటో చూపుతూ "ఈ ఫొటోలోని వాళ్లెవరో మీకేమైనా గుర్తున్నదా..." అన్నది.

శేషయ్య కి గొడవేం అర్థం కావడం లేదు. కేవలం నిర్జీవ ప్రతిమ అయినాడు.

"...నేను ఎరగను..."

"పాపం! ఎరగరు."

"పోనీ ఈ ఫొటోలోని వారినో!" శేషయ్యకు ఏడుపు రావడమే తరువాయిగా ఉన్నది.

"వీళ్ళనూ ఎరుగరు. ఎందుకంటే అందమైన ఆడవాళ్ళను చూసినట్టే మగవాళ్ళకు వివేకం నశిస్తుంది. బి. ఏ. చదివే రోజులలో సంబంధం కల్పించుకుని దాదాపు భార్యాభర్తలులాగా తిరిగిన జీవితమే మరిచిపోయిన మీరు కొడుకు తప్పును దిద్దడానికి ప్రయత్నిస్తున్నారా? ఆ పనిని మీరు చెయ్యాలిసింది ఇక్కడ కాదు. వాసు దగ్గిర. లీలఇంటికి ఈసారి వచ్చారంటే టుపాకిన కాలిపిస్తాను. లీల చిన్నపిల్ల. దానిముందర మీ తెలివితేటలు చూపి చక్కగా బ్రతకాలిసినదాని జీవితాన్ని వేదవల్లి జీవితానికి నకలు చెయ్యకండి..."

"అయితే నువ్వేనా ఆ వేదవల్లివి."

"అవును—కాదు. అవన్నీ వేరే సంగతులు. మీమీద వ్యాజ్యం వేసేటంత తెలివిగలదికాదు-వేదవల్లి. ఒకవేళ అయినా వెయ్యదు."

శేషయ్యకు ఏమీ తోచక నెమ్మదిగా లేచి అడుగుల్లో అడుగు వేసుకుంటూ రోడ్డువెంబడి పడ్డాడు. మారుతున్న నీతి నిలబడి ఆయనవంక చూసి వికటాట్టహాసం చేసినట్లున్నది.

18-11-49

కొత్త పద్ధతులు

# శత్రుత్వాలు

గతించిన కాలంలో యాచకులూ, యాచకులూ కలహించుకునేవారు రాజులూ రాజులూ పోట్లాడుకునేవారు దాయాదులు కొట్లాడుకునేవారు. ముండలకోసం కత్తులుపెట్టి పొడుచుకునేవారు.

పిడికెడు బిచ్చం లగాయతూ, ఆస్తులూ, రాజ్యాలూ, స్త్రీలూ వరకూ స్వార్థంమూలంగా మనుషులమధ్య స్పర్థలూ, ఈర్ష్యలూ, మత్సరాలూ కలిగి వాటివెంట క్రోధ మదాదులు తలలెత్తేవి.

ఇప్పు డదంతా మారిపోతున్నది. స్వార్థాలు మారిపోలేదుగాని ఆదర్శాలది పైచెయ్యి ఐంది. ఆదర్శాల ప్రభావంవల్ల పులులూ మేకలూ, గొర్రెలూ తోడేళ్లూ ఒకే కుండులో నీళ్లు తాగుతున్నాయి. రష్యా అమెరికాలు ఒకే అంతర్జాతీయ సంస్థలలో సభ్యులుగా ఉన్నాయి; బ్రిటను ఇండియాలు ఒకే కామన్వెల్తులో ఉన్నాయి; ఇండోనీషియా హాలండులు ఒకే యూనియనులో ఉండబోతున్నాయి; పెట్టుబడిదార్లూ, కార్మికులూ ఒకే ప్రభుత్వ కమిటీలలో